క్లుప్తంగా

నేడు పోలేపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా పశువులకు చికిత్సలు నిర్వహించి అవసరమైన మందులు అందిస్తామని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నేతలు

మంచాల: గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంచాల సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి అన్నారు. మంచాల గ్రామంలో ఎన్ఆర్ఈజీయస్ నిధులు రూ.5లక్షలతో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సహకారంతో మంచాల గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జ్ఞానేశ్వర్, ఎంపీటీసీ సభ్యుడు నరేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు లింగం, రాజేష్, కోఆప్షన్ సభ్యుడు ఆశ్వల బాలరాజు, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కడ్తాల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోకుండా రైతులు యాజమాన్య పద్ధతులపై దృష్టి సారించాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత సూచించారు. సోమవారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి ఆమె పంటలను పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వివిధ పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అభినవ్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

నేడు కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం

తలకొండపల్లి: మండల పరిధిలోని సంఘాయిపల్లిలో మంగళవారం కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్, జూనియర్ నాయకులతో పాటు, ముఖ్య కార్యకర్తలు హాజరుకాగలరని ఆయన కోరారు.

రూ.71లక్షలు పలికిన పశువుల సంత వేలం

యాచారం: రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దులోని యాచారం మండల పరిధిలోని మాల్ పశువుల సంత నిర్వాహణకు సోమవారం వేలంపాట జరిగింది. గ్రామ సర్పంచ్ పడకంటి కవిత అధ్యక్షతన జరిగిన వేలం పాటలో పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు. చివరకు నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లికి చెందిన ఆంజనేయులు రూ.71,03,000కు పశువుల సంత నిర్వాహణను దక్కించుకున్నాడు. కాగా తైబజార్ వేలం పాటకు వ్యాపారులెవరూ ముందుకు రాలేదు. దీంతో తైబజార్ వేలంపాటను వాయిదా వేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఇస్రత్ బేగం, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ఐక్యతా ఫౌండేషన్ చేయూతనందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బల్లులపల్లి తండా గ్రామ పంచాయతీలోని రాశితండాలో ఇటీవల కురిసిన వర్షానికి తండాకు చెందిన ఇస్లావత్తు గోపాల్‌నాయక్ మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతింది రాఘవేందర్‌రెడ్డి సోమవారం తండాలో దెబ్బతిన్న పంటలను పరిశీలించాడు. తక్షణ సహాయంగా రూ.10,000 గోపాల్‌నాయక్‌కు అందజేశాడు. ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, నరేందర్‌గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఉన్న పురాతన ఆలయాలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు తన కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. అగ్రికల్చర్ కాలనీలోని పురాతన రామాలయంలో విగ్రహాలను కాలనీవాసులు పునః ప్రతిష్ఠించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ సుజాతానాయక్ ప్రత్యేక పూజులు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో చాలా ప్రాంతాల్లోని దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, కాలనీ నేతలు మేఘారెడ్డి, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శర్మ, భారతీయ రాష్ట్ర సమితి నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కల్యాణ్, శశి, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడగండ్లు మిగిల్చిన వడగండ్లు





మంతన్‌గౌరెల్లిలో ఇటీవల వడగళ్ల వర్షానికి ధ్వంసమైన ఇళ్ల రేకులు

- మంతన్‌గౌరెల్లిలో 450 రేకుల ఇళ్లు ధ్వంసం
- రూ.15 కోట్లకు పైగా ఆస్తినష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ బాధితుల వేడుకోలు

యాచారం: వడగండ్ల వర్షంతో నష్టపోయిన తమను ఆదుకోవాలని మంతన్‌గౌరెల్లి గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానతో గ్రామంలోని మెజార్టీ ప్రజలు నిరాశ్రయులుగా మారారు. నాలుగు రోజుల క్రితం మంతన్‌గౌరెల్లి గ్రామంలో కిలోకు పైగా బరువున్న వడగండ్లు కురియడంతో 450 రేకుల ఇళ్లు రంధ్రాలు పడి దెబ్బతిన్నాయి. గంటపాటు ఏకధాటిగా కురిసిన వడగండ్ల వర్షానికి గ్రామంలోని ఆస్తినష్టం పెద్ద మొత్తంలో జరిగింది. వడగండ్లతో రేకుల ఇళ్లన్నీ రంధ్రాలు పడి ఛిద్రంగా మారాయి. రంధ్రాల నుంచి వర్షం నీరు ఇళ్లలోకి చేరి ఇళ్లలో ఉన్న వస్తువులు, బియ్యం, సరుకులు, విలువైన సామగ్రి మొత్తం తడిసిముద్దయ్యాయి. 25 మందికి పైగా వడగండ్లు తగిలి గాయాల పాలయ్యారు. మరసటి రోజు అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామానికి వచ్చి బాధితులను పరామర్శించారు. ప్రకృతి వైపరీత్యం కింద బాధితులకు ఇంటికి 10 కిలోల ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారు.

450 ఇళ్లు ధ్వంసం..

మంతన్‌గౌరెల్లి గ్రామంలోనే 450 రేకుల ఇళ్లు ధ్వంసమై రూ.15 కోట్లకు పైగానే నష్టం వాటిల్లిందని అంచనా. ఒక్కో ఇంటికి 5 నుంచి 10 రేకుల ఉన్నాయి. 5 నుంచి 10 రేకుల ఇళ్లు నిర్మించాలంటే కనీసం రూ.30 వేల నుంచి రూ.50 వేల ఖర్చు అవుతుంది. పెరిగిన రేకుల ఖర్చు, సిమెంట్, ఇసుక ధరలు, కూలీల వేతనాలు ఇలా కనీసం రెండు గదుల ఇళ్లకు మళ్లీ రేకుల బిగించాలంటే రూ.30 వేలకు పైగానే ఖర్చు అవుతుంది. మంతన్‌గౌరెల్లి గ్రామంతో పాటు కేసీతండాలో కూడా 120 రేకుల ఇళ్లకు రంధ్రాలుపడి ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తే తప్ప ధ్వంసమైన ఇళ్లు నిర్మించుకోలేని స్థితిలో బాధితులున్నారు. దీనికి తోడు వరి, కూరగాయల పంటలు సైతం పాడయ్యాయి. పెద్ద ఎత్తున పంట నష్టం కూడా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవ తీసుకొని పరిహారం అందించే విధంగా కృషి చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నాలుగు రోజుల క్రితం గ్రామంలో వడగండ్ల వర్షం గంటపాటు కురిసింది. కిలో బరువుతో ఉండే వడగండ్లు కురియడంతో భయాందోళనకు గురయ్యాం. చాలా మంది వడగండ్లు తగిలి గాయపడ్డారు. రేకుల ఇళ్లపై వడగండ్లు పడటంతో అవి పగిలిపోయాయి. రేకులు తీసి మళ్లీ నిర్మించాలనుకుంటే ప్రతి ఇంటికి కనీసం రూ.30 వేలకు పైగానే ఖర్చు అవుతుంది. బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కనక నర్సయ్య, మంతన్‌గౌరెల్లి

శాశ్వత ఇళ్లు కట్టించి ఇవ్వాలి



గ్రామంలో కురిసిన వడగండ్ల వాన వల్ల రేకుల ఇళ్లు దెబ్బతిని నష్టపోయిన వారిలో మెజార్టీగా దళిత, గిరిజనులే ఉన్నారు. రూ.4 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన రేకుల ఇళ్లు, ఫాల్ సీలింగ్ మొత్తం నష్టపోయింది. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఏమాత్రం సరిపోదు. స్థానిక ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పేదలకు శాశ్వత ఇళ్లు మంజూరు చేయించడంతో పాటు మంచి పరిహారం అందించాలి.

– విజయలక్ష్మి, సర్పంచ్, మంతన్‌గౌరెల్లి

బాధితులను ఆదుకుంటాం



మంతన్‌గౌరెల్లి, కేసీతండాలో దాదాపు 470 వరకు ఇళ్లు దెబ్బతిన్నట్లు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కూడా ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నారు. గ్రామంలోని ప్రతి బాధితుడిని ఆదుకుంటాం. ప్రభుత్వం చేసే ఆర్థిక సహాయాన్ని తీసుకోవాలి. రెండు రోజుల్లో పరిహారం అందజేస్తాం.

– సుచరిత, తహసీల్దార్ యాచారం

డాక్టర్ పద్మావతికి సన్మానం



పద్మావతికి నగదు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

హయత్‌నగర్: అంగవైకల్యాన్ని జయించి సామాజిక సేవ, కళలు, మహిళా సాధికారిత రంగాల్లో మూడు సార్లు రాష్ట్రపతి అవార్డును దక్కించుకున్న డాక్టర్ పి.పద్మావతికి ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా సోమవారం ఘనంగా సన్మానించారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మునుగనూరులోని ఆమె నివాసంలో కలిసి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖమ్మంకు చెందిన పద్మావతి చిన్నతనంలోనే పోలియోతో రెండు కాళ్లు చచ్చుబడిపోయినా ఆత్మవిశ్వాసం వీడకుండా పట్టుదలతో చదువుకుని వివిధ కళల్లో రాణించారని, వైకల్యాన్ని జయించిన ఆమె ఒకవైపు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూనే మహిళా సాధికారిత కోసం కృషిచేస్తున్నారని తెలిపారు. కళారంగంలో ఆమె ప్రతిభకు గుర్తింపుగా 2009లో మొదటిసారి రాష్ట్రపతి అవార్డును పొందారని, 2011లో స్త్రీ శక్తి విభాగంలో మరోసారి రాష్ట్రపతి అవార్డును దక్కించుకోగా, 2022లో మూడోసారి రాష్ట్రపతి అవార్డు ఆమెను వరించిందని తెలిపారు. ముగ్గురు రాష్ట్రపతుల చేతుల మీదుగా మూడుసార్లు రాష్ట్రపతి పురస్కారం పొందిన పద్మావతి దేశంలోనే అరుదైన ఘనత సాధించారన్నారు.

అభయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



కుట్టు మెషీన్లు అందజేస్తున్న ఎంపీపీ కృపేశ్

ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు స్వయం శక్తితో ఎదగాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ పేర్కొన్నారు. అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని ఎల్మినేడు గ్రామంలో గత మూడు నెలులగా నిర్వహించిన మహిళలకు ఉచిత కుట్టు మెషీన్ శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న 33 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమెషీన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కృపేశ్ మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం అభయ ఫౌండేషన్ చేపడుతున్న కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ వైస్ చైర్మన్ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి, ఎలిమినేడు సర్పంచ్ ఎడ్మా అశోకవర్ధన్‌రెడ్డి, అభయ ఫౌండేషన్ చైర్మన్ బాలచందర్, మహిళలు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

యాచారం: మంతన్‌గౌరెల్లి గ్రామంలో వడగళ్లు కురిసి నిరాశ్రాయులుగా మారిన పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు కొర్ర అరవింద్ నాయక్, తావునాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడుతూ... వడగళ్ల వల్ల గ్రామంలో 450 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇంటికి రూ.9 వేలు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందని.. అలా కాకుండా ప్రస్తుతం తక్షణ సహాయం కింద ఇంటికో రూ.లక్ష ఇచ్చి, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నష్టపోయిన అన్ని రకాల పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అందజేయాలని కోరారు. సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు చందు నాయక్, నాయకులు రమేష్, యాదయ్య, బిచ్చ, నర్సింహ, రవి, నర్సింగ్, పటాన్ పాల్గొన్నారు.

పీఆర్ఓ పాషాకు మెల్విన్‌జోన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పాషా

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్ఓ పాషాకు ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ నుంచి మెల్విన్ జోన్ అవార్డు లభించింది. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ గత కొన్నేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోంది. క్లబ్ చేపడుతున్న సేవలను విస్తృతంగా ప్రచారం చేయడంలో గత 15 ఏళ్లుగా క్లబ్ పీఆర్ఓగా పనిచేస్తున్న పాషా విశేషంగా కృషి చేస్తున్నారు.హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో అబోద్ హోటల్ ఆడిటోరియంలో సోమవారం లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ 320ఎ ఎంజెఎఫ్, పీఎంజేఎఫ్‌ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పీఆర్ఓ పాషాకు మెల్విన్‌జోన్ ఫెలో అవార్డును లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ జీఎస్ హోరా అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు చెన్నకిషన్‌రెడ్డి, జూలురి రఘు, జూలురి రమేశ్ బాబు, నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ డా.దామోదర్‌రెడ్డి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ సునీల్‌కుమార్, విద్యాసాగర్‌రెడ్డి, రాధాకృష్ణ, జాన్సన్, జయదేవ్, శ్రీనివాస్‌రావ్, లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ బావండ్ల వెంకటేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు



సమావేశంలో మాట్లాడుతున్న నాగలక్ష్మి

ఎన్‌పీఆర్డీ రాష్ట్ర మహిళా కోకన్వీనర్ నాగలక్ష్మి

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర మహిళా కోకన్వీనర్ నాగలక్ష్మి అన్నారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం మహిళా వికలాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో మహిళలపై అనేక అకృత్యాలు ఒకదాని వెనుక మరొకటి జరుగుతుండటం చాలా బాధాకరమన్నారు. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు.. కుసుమ, నిర్మల, నాయకులు.. భుజంగరెడ్డి, రాజు, రాజశేఖర్‌గౌడ్, విరేష్, పాండురంగారెడ్డి, యాదగిరి, మహేశ్, గణేశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తాం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఐకేపీ ఉద్యోగులు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తున్నారని ఆయన వివరించారు. సెర్ప్, ఐకేపీ ఉద్యోగులకు క్యాడర్ ఫిక్షేషన్ చేయడానికి ప్రభుత్వం అంగీకరించడంతో సెర్ప్, ఐకేపీ ఉద్యోగులు సోమవారం ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారిపై సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఐకేపీ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చిన విధంగా వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నవారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కడ్తాల మండల ఐకేపీ ఏపీఎం రాజేశ్వరీ, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల సీసీలు రామచంద్రయ్య, కృష్ణ, మహేందర్, పోచయ్య, రామయ్య, దీప, విజయలక్ష్మి, వసంత, జరీనా, రాములు, యాదయ్య, శ్రీశైలం, సత్యం, నర్సింహ, ఆమనగల్లు మున్సిపాలిటీ టీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, రైతు సమన్వయ సమితి కన్వీనర్ నిట్టె నారాయణ, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టును ఎమ్మెల్యే సందర్శించారు. కోర్టు భవనాల నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండా వద్ద జరుగుతున్న మైనింగ్ పనులను నిలిపివేయాలని కోరుతూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు తండావాసులు వినతిపత్రం అందించారు.

గడ్డమల్లయ్యగూడలో మల్లేశ్ విగ్రహావిష్కరణ

యాచారం: గడ్డమల్లయ్యగూడ మాజీ సర్పంచ్ నర్రె మల్లేష్ నిబద్ధత, మాటమీద నిలబడే వ్యక్తిత్వం కలిగిన నేత అని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గతేడాది అనారోగ్యంతో నర్రె మల్లేష్ మృతి చెందాడు. బీఆర్ఎస్ శ్రేణులు, మల్లేష్ కుటుంబ సభ్యులు గ్రామంలో ఆయన నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మల్లేష్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నర్రె మల్లేష్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు. సర్పంచ్ పదవీ కాలంలో గ్రామాభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. మల్లేష్ ఆశయాల కోసం తాను కూడా గడ్డమల్లయ్యగూడ అభివృద్ధి కోసం అధిక నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, పాశ్ఛ బాషా, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు మల్లేష్, అయిలయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా ఇన్‌చార్జిగా జంగమయ్యగౌడ్



జంగమయ్యగౌడ్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీ ఓబీసీ మోర్చా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జిగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామానికి చెందిన రంగా జంగమయ్యగౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. మండలానికి చెందిన సీనియర్ పార్టీ నాయకుడు రంగా జంగమయ్యగౌడ్‌ను నియోజకవర్గ ఓబీసీ మోర్చా ఇన్‌చార్జిగా నియమించడం పట్ల అబ్దుల్లాపూర్‌మెట్ మండల బీజేపీ అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం మండల పార్టీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు సురేష్‌గౌడ్, శ్రావణ్‌చారి, నాయకులు పాపయ్యగౌడ్, రాజేశ్వర్, యాదగిరి, గోవర్ధన్, రమేష్, ఆనంద్, ధనుంజయ్య, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, సురేఖారాజు, రమాదేవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నేడు తైబజార్ వేలం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం 2023–24 సంవత్సరానికి తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో డీడీ చెల్లించిన వారు మాత్రమే పాల్గొనాలని ఆయన కోరారు.

253 మందికి కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్, దేవుని పడకల్ కంటి వైద్య శిబిరాల్లో సోమవారం 253 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు కల్పన, స్నేహ, సైదమ్మ తెలిపారు. మందులు, అవసరమున్న వారికి అద్దాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెఏలు మల్లయ్య, రామచంద్రయ్య, రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

కడ్తాల్: కడ్తాల మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సోమవారం ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ అఖిల్ ఆధ్వర్యంలో 336 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నరేందర్, పర్వతాలు, తలకొండపల్లి సర్పంచ్ లలితా జ్యోతయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌యాదవ్, నాయకులు తిరుపతిరెడ్డి, సుధాకర్, శ్రీకాంత్, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సంగీత

సర్పంచ్ సంగీత

తలకొండపల్లి: దేవాలయాలాభివద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తానని సర్పంచ్ సంగీతా శ్రీనివాసుయాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌లో శ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరైన రూ.10 లక్షల ఉపాధిహామీ నిధులతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహ్మాన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవికుమార్, ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, ఎంపీటీసీ అంబాజీ, కార్యదర్శి శరత్ కుమార్, నాయకులు.. శ్రీరామ్, జంగయ్య, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం కల్పించండి



జీపుజాతలో మాట్లాడుతున్న రాజు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

కడ్తాల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను, రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. జీపు జాత ప్రచారంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో వారు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్మికులక పనికి తగిన వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జిల్లా నాయకులు గుమ్మడి, కురుమయ్య, శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్, కుమార్, ప్రజాసంఘాల నాయకులు శ్రీశైలం, కుమార్, అంజయ్య, యాదయ్య ఉన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించండి



వినతిపత్రం అందజేస్తున్న శాలివాహన కులస్తులు

కడ్తాల్: గ్రామంలో శాలివాహన కులస్తులకు సమావేశాల నిర్వాహణకు ప్రత్యేకంగా భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని శాలివాహన కులస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. అన్ని కుల సంఘాల మాదిరిగానే శాలివాహన కులస్తులకు కమ్యూనిటీ భవన నిర్మాణంకు స్థలం కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్థలాన్ని కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటాయని సర్పంచ్ వారికి హామీ ఇచ్చారు. అంతకుముందు సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ పంచాయతీ పాలకమండలి సమావేశంలో గ్రామంలోని సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు మల్లయ్య భిక్షపతి, నరేందర్‌రెడ్డి, మహేశ్, మహేశ్, ఖైరున్నిసాబేగం, సువర్ణ, వెంకటయ్యగౌడ్, ఎట్టమ్మ, శాలివాహన కులస్తులు శ్రీశైలం, నర్సింహ, చంద్రకళ, అలివేలు, భారతమ్మ, కార్యదర్శి జగన్ ఉన్నారు.